# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 138 VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: బుధవారం 10 జూన్ 2026








2వ పేజీలో...




2వ పేజీలో...




2వ పేజీలో...

## తెలంగాణకు ఆశాజ్యోతి బీజేపీ: రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**యాదగిరిగుట్ట (సమయం ప్రతినిధి):** తెలంగాణ ప్రజలకు భారతీయ జనతా పార్టీ ఆశాజ్యోతిగా మారిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. యాదగిరిగుట్టలో యాదాద్రి-భువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ కార్యకర్తల శిక్షణా శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్ధాంత పరమైన కార్యకర్తలను తీర్చిదిద్దుతూ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీయేనని పేర్కొన్నారు. రెండు రోజుల శిక్షణా శిబిరంలో పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, కార్య విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాటం, సామాజిక మాధ్యమాల వినియోగం, ప్రజలతో అనుసంధానం తదితర 11 ప్రధాన అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాల్లో దేశం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెరిగిన తీరును ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని రామచందర్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్లపై విమర్శలు చేయడం తప్ప రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కృషి ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. మూసీ నది ప్రక్షాళన పేరుతో అవినీతికి తావిచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, రెండు పార్టీలు ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి-భువనగిరి జిల్లా ఇన్‌చార్జ్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, అశోక్ కళ్యాణ్ నాయక్, గూడూరు నారాయణ రెడ్డి, రమేష్ యాదిరెడ్డి, చందర్ తదితర నాయకులతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**భాగ్యనగరంలో** భారీ వర్షం కురుస్తోండటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** ముఖ్యంగా లోతట్టు కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లలో నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా, కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అయింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు మరికొన్ని గంటల పాటు నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.







# సంపాదకీయం

## సంక్షోభాల్లోనే పొదుపు గుర్తుకు వస్తుందా?

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల దేశ ప్రజలు పొదుపు చర్యలను పాటించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వంలో పొదుపు చర్యలు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ సహా మరికొన్ని రాష్ట్రాలు ప్రధాని సూచనను శిరసావహిస్తూ ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టాయి. గత నెల హైదరాబాదులో జరిగిన సభలో ప్రజలందరూ పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలనీ, ప్రజా రవాణాను ఎక్కువగా వినియోగించుకోవాలనీ పిలుపునిస్తూనే, విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవడానికి బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలని కూడా చెప్పారు.

పొదుపు పాటించాలని ప్రజలకు పాలకులు పిలుపునివ్వడం మన దేశంలో ఇదే మొదటిసారి కాదు. దేశ ఆర్థిక పరిస్థితి ఎప్పుడు చిక్కుల్లో పడినా, ప్రపంచ పరిణామాల నేపథ్యంలో ఏ ఆర్థిక సంక్షోభం ముంచుకొచ్చినా అప్పటికప్పుడు పొదుపు చర్యల వైపు పరుగులు పెట్టడం మనకు అలవాటే! నిజానికి ప్రజలు, ప్రభుత్వాలు పొదుపు పాటించడం మంచిదే! అయితే పొదుపు అన్నది మన జీవితంలో ఓ అంతర్భాగం కావాలి. కానీ వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా ఇబ్బందులు ఎదురైనప్పుడే పొదుపు గుర్తుకు రావడం, మిగతా సమయాల్లో దుబారా చేయడం భారతీయులకు అలవాటైపోయింది. దేశంలో కొనుగోళ్ల సంస్కృతి విపరీతంగా పెరిగిపోయిన తర్వాత-ఎక్కువ మంది ప్రజలు అంతకుముందులా కొద్దిగా పాడైన వస్తువులను బాగు చేయించుకొని తిరిగి వాడటం లేదు. పాతవి పడేసి కొత్తవి కొంటున్నారు. ఉదాహరణకు గతంలో ప్రజలు తాము ధరించే చెప్పులు పాడైతే వాటిని కుట్టించుకొని మరికొంత కాలం వాడేవారు. కానీ ఇప్పుడు దాదాపు ఆ పరిస్థితి లేదు. నేటి కొనుగోళ్ల సంస్కృతిలో అన్ని రకాల ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. దానివల్ల, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయన్న మాట నిజమేగానీ, ప్రజల్లో పొదుపు పట్ల అవగాహన పూర్తిగా లోపించింది. ప్రభుత్వాలు సైతం ప్రజలను పొదుపు పట్ల చైతన్యవంతం చేయడం లేదు.

ఆర్థిక మాంద్యం లేదా ఆర్థిక సంక్షోభం తలెత్తినప్పుడు మాత్రమే పొదుపు మంత్రం జపించడం, మిగతా సమయంలో దానిపై దృష్టి పెట్టకపోవడం ఏ ఆర్థిక వ్యవస్థకూ మేలు చేయదు. నిజానికి నేడు ప్రపంచంలో భారత్ సహా మెజార్టీ దేశాలు బడ్జెట్ లోటుతోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ రాబడి కంటే ఖర్చులు పెరిగిపోయినప్పుడు బడ్జెట్ లోటు ఏర్పడుతుంది. దాన్ని భర్తీ చేయడానికి పన్నులు పెంచడం, ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవడం, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో కోత పెట్టడం అనివార్యం. అయితే అధికారంలో ఉండేవారు నిరంతరం రాబోయే ఎన్నికలలో ఎలా గెలవాలన్న అంశం మీదే దృష్టి పెడతారు. కాబట్టి ఇలాంటి చర్యలతో ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందన్న భయంతో ఆ నిర్ణయాలను వాయిదా వేస్తుంటారు. అందుకే ప్రస్తుతం లోటు బడ్జెట్‌ను కొనసాగిస్తూనే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం ప్రతి ఏటా అప్పుల మీద అప్పులు చేస్తున్నారు. ఇది ఒక రకంగా ఆర్థిక సంక్షోభమే. కానీ, ఈ నిజాన్ని ఏ ప్రభుత్వమూ బహిరంగంగా చెప్పదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వాలకు అప్పులు ఇచ్చే ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తదితర అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అప్పు ఇవ్వడానికి కొన్ని ఆంక్షలు విధిస్తున్నాయి. 1998 నుంచి దాదాపు నాలుగేళ్ల పాటు అతిపెద్ద ఆర్థిక సంక్షోభం ఎదుర్కొన్న అర్జెంటీనాను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ఐఎంఎఫ్ ఆ దేశానికి అనేక షరతులు విధించింది. అందులో ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత, పెన్షన్‌దారులకు పెన్షన్‌లో కోత మొదలుకొని పలు సంక్షేమ కార్యక్రమాలకు కత్తెర వేయాలన్న నిబంధనలు ఉన్నాయి. అర్జెంటీనాతోపాటు ఐర్లాండ్, పోర్చుగల్, తుర్కియే తదితర దేశాలు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొన్నప్పుడు సైతం ప్రపంచ స్థాయి ఆర్థిక సంస్థలు ఆ దేశాల ఆర్థిక విధానాలను ప్రభావితం చేశాయి. 1991లో భారతదేశం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడు ప్రధాని పీవీ నరసింహారావు దేశంలో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఎగుమతులను ప్రోత్సహించడానికి రూపాయి విలువను తగ్గించారు. లైసెన్స్ రాజ్‌ను రద్దు చేశారు. పరిశ్రమలు, వ్యాపారాలలో ప్రభుత్వ జోక్యం తగ్గినప్పుడు అవి ఉత్తమంగా పనిచేస్తాయన్న లైసెజ్-ఫెయిర్ (Laissez- faire) మార్గాన్ని అనుసరించారు. ఫలితంగానే రెండేళ్ల వ్యవధిలో భారత ఆర్థిక వ్యవస్థ చాలా వరకు కోలుకుంది. ఉదార ఆర్థిక విధానాలు అమలుచేయడం వలన దేశంలో సంపద పెరిగింది. అదే సమయంలో కొనుగోళ్ల సంస్కృతి విస్తరించింది. మూలధనాన్ని కూడబెట్టడం కంటే విలాస వస్తువులు వాడటం పట్ల ప్రజల్లో మోజు పెరిగిపోయింది. హోదాను ప్రదర్శించుకొనేందుకు మధ్యతరగతి ప్రజలు సైతం విలాస వస్తువులను కొనుగోలు చేయటం ఎక్కువైంది. ఫలితంగా దేశంలో సంపన్నులు మొదలుకొని మధ్యతరగతి ప్రజానీకం వరకు బంగారు ఆభరణాల్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం అత్యధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చించి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే సమాజంలో నిరాడంబరత, పొదుపు అనే వాటికి స్థానం లేకుండా పోయింది. ప్రజలు పొదుపు పాటించడం వల్ల ముడి చమురు, బంగారం కొనుగోళ్లకు వినియోగించే విదేశీ మారకద్రవ్యం పరిమాణం తగ్గుతుంది. దానివల్ల అనేక రంగాల్లో డిమాండ్ తగ్గుతుంది. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం నిలిచిపోతుంది. అలాగే వస్తు వినిమయం పడిపోతుంది. ఫలితంగా దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు క్షీణిస్తాయి. పొదుపు వల్ల ఫిస్కల్ కన్సాలిడేషన్ (ద్రవ్య లోటు నియంత్రణ) జరగదు. దేశంలోని వాస్తవ ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా నిర్ణయాలు జరిగినప్పుడే ఆశించిన ఫలితాలు అందుతాయి. ఈ నిజాన్ని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త పాల్ క్రూగ్ మెన్ పలు సందర్భాల్లో నొక్కి చెప్పారు. ఐఎంఎఫ్ కూడా దీనిని చాలా వరకూ అంగీకరించింది. ప్రధాని పొదుపు పిలుపు తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ఎంత డబ్బు ఆదా అయిందో ఇప్పటికిప్పుడు లెక్కలు బయటకు రావు. కానీ, ఆ పిలుపుతో పాటు పెట్రో ఉత్పత్తుల ధరల పెరుగుదల, బంగారంపై తాజాగా విధించిన అదనపు పన్నులు వగైరా చర్యల వల్ల పేద, మధ్యతరగతి వర్గాల వారి జీవనం దుర్భరం అవుతుంది. ఎనిమిది కీలక రంగాలలోని పరిశ్రమలలో సాలీనా 7శాతం అభివృద్ధి కనబడాల్సి ఉండగా అది కేవలం 1.7శాతానికి పరిమితమైందని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీనిని బట్టి దేశ ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి పొదుపు ఒక్కటే తారక మంత్రం కాదని అనుభవంలో అందరికీ అర్థమవుతోంది.

## సంతకాల ఫోర్జరీ కేసు.. మమతా బెనర్జీ కార్యాలయానికి సీఐడీ టీమ్

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేల సంతకాల ఫోర్జరీకి సంబంధించిన కేసులో తృణమూల్ కాంగ్రెస్ (TMC)కు మరిన్ని చిక్కులు తప్పేలా లేవు. ఈ కేసు విచారణలో భాగంగా ఖాళీఘాట్‌లోని టీఎంసీ కార్యాలయానికి సీఐడీ బృందం మంగళవారంనాడు వెళ్లింది. అయితే సీఐడీ టీమ్‌ను కార్యాలయం ఆవరణలోకి అనుమతించలేదని తెలుస్తోంది. టీఎంసీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నివాసానికి ఆనుకుని ఈ కార్యాలయం ఉంది. తొలుత ఖాళీఘాట్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని వెంట తీసుకుని సీఐడీ బృందం టీఎంసీ కార్యాలయానికి వెళ్లింది. కార్యాలయం వద్ద వేచిచూస్తుండగా వారిని కలిసేందుకు టీఎంసీ మాజీ ఎంపీ, పార్టీ కోశాధికారి సుభాశిష్ చక్రవర్తి బయటకు వచ్చారు. మమతా బెనర్జీ , టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీలు ఇండియా కూటమి సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీలో ఉన్నారని సీఐడీ బృందానికి చక్రవరి తెలియజేశారు. వారు లేకుండా లోపలకు అనుమతించలేమని చెప్పారు. అయితే విచారణలో భాగంగానే తాము వచ్చామనీ, సంబంధితులు ఎవరూ ఉండాల్సిన పని లేదని సీఐడీ అధికారుల తెలిపారు. అభిషేక్‌కు ఇచ్చిన నోటీసును చూపిస్తూ, సెర్చ్ ఆపరేషన్‌కు సహకరించాలని కోరారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలుస్తోంది. కామాక్ స్ట్రీట్‌లోని అభిషేక్ బెనర్జీ నివాసానికి కూడా ఒక సీఐడీ టీమ్ వెళ్లిందని సమాచారం. నకిలీ సంతకాల కేసులో పోలీస్ ఇన్వెస్టిగేషన్‌ను సహకరిస్తున్న సీఐడీ టీమ్ గత మే 30న తొలిసారి అభిషేక్ ఖాళీఘాట్ నివాసానికి వెళ్లింది. జూన్ 1న విచారణకు హాజరుకావాలని కోరింది. అయితే తనకు 14 రోజులు గడువు ఇవ్వాలని అభిషేక్ కోరారు. ఆయన చేసిన విజ్ఞప్తిని సీఐడీ తోసిపుచ్చింది. వారం రోజుల్లోగా తమ ముందు హాజరుకావాలని తాజా నోటీసు ఇచ్చింది. అయితే సోమవారంతో ఆ గడువు ముగిసినప్పటికీ సీఐడీ విచారణకు అభిషేక్ హాజరుకాలేదు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా శోవన్‌దేబ్ ఛటోపాధ్యాయ, ప్రతిపక్ష ఉపనాయకులుగా అసిమా పాత్రా, నైనా బంద్యోపాధ్యాయ, చీఫ్ విప్‌గా ఫిర్హాద్ హకీంల నియామకానికి సంబంధించి అసెంబ్లీకి సమర్పించిన పత్రాలపై పలువురు టీఎంసీ ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు దర్యాప్తు జరుగుతోంది.

## మా అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో..: సీఎం

మొదటి పేజీ తరువాయి

మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు.

**మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తాం..**

మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు.

**ఆటోడ్రైవర్లను రెచ్చగొట్టారు..**

ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలి..**

కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్నీ కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## విజయ్ కీలక నిర్ణయం.. మహిళల భద్రత కోసం సింగప్పెన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్

మొదటి పేజీ తరువాయి

తమిళనాడు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం నిర్ణయం తీసుకుంది. మహిళల భద్రత కోసం 'సింగప్పెన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్'ను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాన్ని ముఖ్యమంత్రి విజయ్ మంగళవారంనాడు ప్రారంభించారు. సింగప్పెన్ దళం చిహ్నాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ బృందాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గస్తీ వాహనాలను ప్రారంభించడంతో పాటు స్వయంగా ఒక వాహనాన్ని సీఎం నడిపారు. రాజరాతినం స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, మహిళలపై జరిగే నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అన్నారు. నేరాలకు శిక్ష కూడా కఠినంగా ఉంటుందని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం సింగప్పెన్ బృందం రాష్ట్రవ్యాప్తంగా డ్రోన్‌లను మోహరిస్తుందని, ఈ తరహాలో ఏర్పాట్లు చేయడం దేశంలోనే తొలిసారని చెప్పారు. డ్రోన్ల సహాయంతో ఎక్కడ ఎవరు మహిళలను వేధించినా తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్‌కు అలవాటు పడిన వారే ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని, మహిళలు, చిన్నారులపై నేరాలకూ మాదకద్రవ్యాల వ్యాప్తికీ సంబంధం ఉందన్నారు. మాదకద్రవ్యాల బెడదను పూర్తిగా నిర్మూలించాల్సి ఉందని చెప్పారు. సమస్యను చాలాకాలంగా నిర్లక్ష్యం చేస్తున్నందున అది బలంగా వేళ్లూనుకుందని, ఈ నిర్లక్ష్యానికి కారకులెవరో తాను ప్రత్యేకంగా చెప్పనక్కరలేదని అన్నారు. సింగప్పెన్ కోసం తొలిదశలో రూ.354 కోట్లు కేటాయించనున్నామని, రెండో దశలో కొత్త యూనిట్ కోసం 2,500 కొత్త పోస్టులు కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన పోలీస్ పరేడ్‌లో విజయ్ పాల్గొన్నారు.

## నీట్ ఎక్స్‌పర్ట్స్ లాక్ డౌన్..

న్యూఢిల్లీ : వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ 2026 రీ ఎగ్జామినేషన్‌కు ముహూర్తం దగ్గరపడుతుండటంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసాధారణమైన భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టింది. మే 3న జరిగిన మొదటి పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఎన్‌టీఏ.. ఈసారి జూన్ 21న జరగబోయే రీ టెస్ట్ విషయంలో జీరో ఎర్రర్ పాలసీని అమలు చేస్తోంది. పేపర్ లీకేజీకి అస్సలు ఛాన్స్ లేకుండా పేపర్ తయారీ దశ నుంచే ఊహించని రేంజ్‌లో కట్టుదిట్టమైన కమాండో తరహా భద్రతను ఏర్పాటు చేసింది.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. నీట్ రీ ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో భాగస్వాములైన సబ్జెక్ట్ నిపుణులు, పర్యవేక్షకులు, వివిధ భాషల్లోకి అనువదించే ట్రాన్స్‌లేటర్లతో కూడిన యావత్ టీమ్‌ను కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో ఒక అత్యంత రహస్య ప్రాంతంలో లాక్‌డౌన్ చేశారు. ఈ లాక్‌డౌన్ ప్రాంగణంలో ఉన్నవారికి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న ఎలాంటి కమ్యూనికేషన్ పరికరాలనూ అనుమతించడం లేదు. కేవలం ముందస్తు అనుమతి పొందిన ప్రత్యేక సిబ్బందికి మాత్రమే ఈ జోన్‌లోకి ప్రవేశం ఉంటుంది. జూన్ 21న పరీక్ష ముగిసేంతవరకు ఈ నిపుణుల బృందం బయటి ప్రపంచానికి పూర్తిగా దూరంగా ఇదే నిఘా నీడలో గడపనుందిగతంలో రవాణా, స్టోరేజ్ దశల్లోనే లీకేజీలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో.. ఈసారి ఎన్‌టీఏ సరికొత్త మల్టీ లేయర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను రంగంలోకి దించింది. క్వశ్చన్ పేపర్ల ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజ్ నుంచి పరీక్షా కేంద్రాలకు చేరే వరకు ప్రతి దశలోనూ బహుళ అంచెల నిఘా ఉంటుంది. అత్యంత కీలకమైన విషయం ఏంటంటే.. ఈ ప్రశ్నపత్రాల రవాణా కోసం ఈసారి భారత వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ప్రైవేట్ రవాణా సంస్థల జోక్యం తగ్గి.. పేపర్లు అత్యంత సురక్షితంగా జిల్లాలకు చేరుకుంటాయి.ఇదిలా ఉండగా.. రీ ఎగ్జామ్ పేపర్ కూడా ముందే లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో కొన్ని ఫేక్ వార్తలు చక్కర్లు కొట్టడంపై ఎన్‌టీఏ తీవ్రంగా స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం పూర్తిగా అవాస్తవమని, మోసపూరితమైనదని స్పష్టం చేసింది. ఇలాంటి పుకార్లను నమ్మి అభ్యర్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దని, కేవలం అధికారిక వెబ్‌సైట్ సమాచారాన్ని మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేసింది. ఇలాంటి ఫేక్ ప్రచారం చేసే అకౌంట్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షలో లీకేజీ కలకలం రేగడంతో.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మే 12న ఆ పరీక్షను ఎన్‌టీఏ అధికారికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే.

## లక్ష డాలర్ల ఫీజు.. తలబొప్పి కట్టింది

న్యూఢిల్లీ : దెబ్బ మీద దెబ్బ.. ఇది మామూలు దిబ్బ కాదు. ట్రంప్ దిమ్మ తిరిగిపోయే దెబ్బ. కాళ్ళ కింద భూమి కంపించి పోయే దెబ్బ. ఇక జన్మలో ఆ మాట కూడా ఎత్తడానికి కూడా భయపడే దెబ్బ.. అమెరికాలో ఏకచత్రాధిపత్యంగా.. మూర్ఖుడి మాదిరిగా నిర్ణయాలు తీసుకుంటున్న ట్రంప్ కు అక్కడి కోర్టు తిరుగులేని తీర్పు ఇచ్చింది. ఇకపై జన్మలో ఆ ఊసు ఎత్తడానికి కూడా వణుకు పుట్టేలా చేసింది.ట్రంప్ తన పరిపాలన నిర్లక్ష్యాన్ని ప్రపంచ మీద రుద్దడానికి రకరకాల విన్యాసాలకు పాల్పడుతున్నాడు. ప్రపంచ దేశాల మీద అనవసరమైన సుంకాలు విధించడం.. ఇంకా లేనిపోని షరతులు విధించడం.. యుద్ధాలు చేయడం.. ఇలాంటి ఎన్నో దారుణాలకు పాల్పడుతున్నాడు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే. ట్రంప్ తీసుకున్న మరో దారుణమైన నిర్ణయం అమెరికా కంపెనీలకు కోలుకోలేని ఇబ్బందిగా మారింది. అమెరికా యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశం లో భాగంగా.. అమెరికన్ కంపెనీల పై ట్రంప్ ప్రత్యేకమైన రుసుము వసూలు చేస్తామని ప్రకటించారు.. ప్రత్యేకమైన నైపుణ్యాల కోసం విదేశీ కార్మికులను నియమించుకునే యాజమాన్యాలు లక్ష డాలర్లు రుసుము చెల్లించాలని ట్రంప్ ఒక పనికిమాలిన విధానాన్ని తెరపైకి తీసుకొచ్చాడు. దీనిపై నిరసనలు వ్యక్తమయ్యాయి.ట్రంప్ తీసుకొని నిర్ణయం పట్ల అమెరికా కాంగ్రెస్ కూడా ఆమోదం తెలపలేదు. దీనిని చట్ట విరుద్ధమైన పన్ను అని బోస్టన్ ఫెడరల్ కోర్టు అభిప్రాయపడింది. విదేశాల నుంచి వచ్చే వృత్తి నిపుణులకు హెచ్ 1 బీ వీసాలు ఇవ్వడానికి లక్ష డాలర్ల ఫీజు వసూలు చేయడం ఏంటని కోర్టు మండిపడింది.ట్రంప్ తీసుకున్న నిర్ణయం చల్లదని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియోసోరోకిన్ అత్యంత చారిత్రాత్మకమైన తీర్పు చెప్పారు.

# గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు





మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రైకార్ ద్వారా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కార్యక్రమాలపై గిరిజన యువతకు అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో లభించే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు పొందాలంటే సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన శిక్షణ ఎంతో అవసరమని ఆయన అన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గిరిజన యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన యువతి, యువకులకు నిపుణులైన కౌన్సెలర్లు రవి శంకర్, పి. రాంబాబు, నేహా డాలీ ప్రేరణాత్మక శిక్షణ అందించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వసతి, ఉచిత భోజన సదుపాయాలతో పాటు వివిధ ట్రేడ్లలో అందించే ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, వాటి ద్వారా లభించే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. అలాగే గిరిజన యువత కోసం అమలు చేస్తున్న వివిధ స్వయం ఉపాధి పథకాల గురించి వివరించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ గిరిజన యువతి, యువకులకు హైదరాబాద్‌లోని మెగా స్కిల్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కోర్సును బట్టి శిక్షణ కాలవ్యవధి మూడు నుంచి ఆరు నెలల వరకు ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. డొమైన్, నాన్–డొమైన్ అంశాల్లో శిక్షణ అందించబడుతుందని తెలిపారు. డొమైన్ కోర్సుల్లో టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్, బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ తదితర కోర్సులు ఉండగా, నాన్–డొమైన్ అంశాల్లో సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాథమిక కంప్యూటర్ నైపుణ్యాలపై శిక్షణ అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మలా, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం. ఛత్రు నాయక్, కౌన్సెలింగ్ నిపుణులు రవి శంకర్, పి. రాంబాబు, నేహా డాలీ, గిరిజన యువతి, యువకులు, డి.టి.డి.ఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గూడు షాను పరామర్శించిన ఆల వెంకటేశ్వర్ రెడ్డి



హైదరాబాద్ : హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని శ్రీకర ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం చికిత్స పొందుతున్న మదనాపురం మండలం కొన్నూరు గ్రామ సర్పంచ్ రసూల్ బీ భర్త గూడు షాను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లిన ఆయన గూడు షా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. గూడు షా త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.

## బడిబాటలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించిన జడ్‌పిహెచ్‌ఎస్ వెన్నచెడు ఉపాధ్యాయులు



గండీడ్, (సమయం ప్రతినిధి): గండీడ్ మండలం వెన్నచెడు గ్రామంలోని జడ్‌పిహెచ్‌ఎస్ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జనంపల్లి, గోవిందపల్లి, సుబ్బయ్య నాయక్ తండా, సారంగరావుపల్లి, వాల్య నాయక్ తండా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయితేనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు హనుమంతు, అంజలయ్య (పీఈటీ), చంద్రమౌళి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి, సమయం ప్రతినిధి : మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీరంగాపురం మండలం పరిధిలోని లక్ష్మి వారాహి ఇండస్ట్రీ, పెబ్బేరు పరిధిలో రాధాకృష్ణ ఇండస్ట్రీస్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా మిల్లుల గోదాముల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు. లారీలలో ఉన్న ధాన్యం పై టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. మిల్లుల వద్ద లారీలను ఎక్కువ సమయం వేచి ఉంచకుండా తగ్గించేందుకు గాను హమాలీల (కార్మికుల) సంఖ్యను పెంచుకోవాలని మిల్లర్లకు చెప్పారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేస్తూ రోజువారీ అన్లోడ్ సామర్థ్యాన్ని పెంచాలని, ఎక్కడా లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. ఇంకా ధాన్యం నిల్వ చేయడానికి గోదాములను సిద్ధం చేయాలని పౌర సరఫరాల అధికారికి సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించండి

**ఎస్టీయూ అధ్యక్షులు శ్రీధర్ రావు**




నాగర్ కర్నూల్, సమయం ప్రతినిధి: ఎస్ టి యు ఎనభై యవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు మంగళవారం సంఘ కార్యాలయంలో జెండా విష్కరణ చేసినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) తన 79 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని,ఈ సంఘం 1947 జూన్ లో స్థాపించబడి ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు విద్యా అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తోందని అన్నారు. ఉపాధ్యాయుల వేతనాలు, పదోన్నతులు, సేవా భద్రత వంటి అంశాలపై అలుపెరగని పోరాటాలు చేసిందని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం మరియు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని,విద్యా రంగంలో వచ్చిన అనేక మార్పులు,సంస్కరణలలో ఎస్టీయూ కీలక పాత్ర పోషించింది. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాల కోసం కృషి చేసిందన్నారు. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి మరియు విద్యార్థుల శ్రేయస్సుకు సేవలు అందించింది. 80 సంవత్సరాల చరిత్రలో అనేక మంది నాయకులు, కార్యకర్తలు సంఘాన్ని బలోపేతం చేశారు. భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయ సంక్షేమం, విద్యా నాణ్యత పెంపు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం లక్ష్యాలుగా కొనసాగుతామని పేర్కొన్నారు. 40 రోజుల కిందట ముఖ్యమంత్రి గారు ఇచ్చిన తక్షణ హామీలలో పీఆర్సీ గానీ, హెల్త్ కార్డులు గానీ, సీపీ యస్ విషయం గానీ, అమలు కాకపోగా 16 వేల ప్రాథమిక బడులలో 4వేల వరకు ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలనడం, క్షేత్రస్థాయిలో పబ్లిక్ స్కూల్స్ కు తగిన ఏర్పాట్లు, వసతులు కల్పించకుండానే అడ్మిషన్లు అయ్యే సమయంలో ప్రారంభిస్తామనడం సరి కాదని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి,పూర్వ అధ్యక్షులు మురళి, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు రమేష్, అనిల్ కుమార్ రెడ్డి, ప్రభాకర్,జిల్లా మండల ప్రతినిధులు ఎ. హన్మంత రెడ్డి,మద్దిలేటి, ఈశ్వర్,కర్ణాకర్ రెడ్డి,బాలస్వామి,హన్మంతు, నర్సింహ్మా,సురేష్ బాబు, సత్యనారాయణ,వెంకటస్వామి, రాజన్ గౌడ్,నారాయణ, రాజేష్,లక్ష్మి నరసింహ రెడ్డి మొదలైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేదలకు భరోసా సిఎం రిలీఫ్ ఫండ్ - ప్రభుత్వ విప్





(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసా కల్పిస్తుందన్నారు ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డ పేర్కొన్నారు . మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 80 మంది లబ్దిదారులకు ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత రెండున్నర సంవత్సరాల్లో దాదాపు మూడు వేల మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద ప్రజలకు కూడా ప్రభుత్వం సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఇందుకోసం గౌరవ ముఖ్యమంత్రి లిశ్రీ రేవంత్ రెడ్డి సుమారు మూడు వేల కోట్ల రూపాయలను కేటాయించారని ఆయన తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిబ్బందిని నియమించామని ఆయన చెప్పారు. అవసరమైన పత్రాలు సమర్పించిన వారికి మూడు నెలల్లోనే చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో లేనివిధంగా వేగవంతమైన వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి " ఇందిరమ్మ జీవన బీమా " పథకం అమలు చేయనున్నామని వెల్లడించారు. దురదృష్టవశాత్తు కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచుతూ, వైద్యులను నియమిస్తూ మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆయన చెప్పారు. అలాగే విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇళ్లు మంజూరు చేసి, మరో 2,500 ఇళ్లను పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని గమనించి ప్రజలు మళ్లీ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్లు షబ్బీర్ అహ్మద్, అవేజ్, తాహేర్, భాను చందర్ , మజ్జీద్, ఎంపి ప్రవీణ్, నాయకులు రాములు యాదవ్, అజ్మత్ అలి, సల్మాన్, లీడర్ రఘు, శరత్, ఫైసల్ ,అక్బర్, మోయిాజ్, అశ్వాక్ , రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు ఉద్యమం ఉద్ధృతం

**జూన్ 16న కీలక సమావేశం - రాజకీయ పార్టీలతో చర్చలు, జేపీసీల ఏర్పాటు దిశగా అడుగులు**




మహబూబ్‌నగర్ (సమయం ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టిన ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ నిర్ణయించింది. ఈ విషయాన్ని జేఏసీ కన్వీనర్ టీజీ శ్రీనివాస్ వెల్లడించారు. జేఏసీ ఏర్పాటు అనంతరం ఏప్రిల్, మే నెలలతో పాటు జూన్ తొలి వారంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించినట్లు తెలిపారు. ప్రాజెక్టుల పరిస్థితిని ప్రజలకు తెలియజేసేందుకు పలు ప్రాంతాల్లో పాత్రికేయుల సమావేశాలు నిర్వహించామని చెప్పారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులకు గత పాలకుల రాజకీయ వైఫల్యాలే కారణమని పేర్కొంటూ ప్రజా ప్రతినిధుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖలు పంపినట్లు వెల్లడించారు. జేఏసీ చేపట్టిన కార్యక్రమాల ప్రభావంతో జిల్లాలో సాగునీటి అంశం రాజకీయ చర్చకు దారితీసిందని, ప్రజా ప్రతినిధుల చొరవతో ముఖ్యమంత్రి జిల్లాకు సంబంధించిన నీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చేపట్టిన పర్యటనలో కృష్ణా, భీమా నదులపై బ్యారేజీల నిర్మాణ అవకాశాలను పరిశీలించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఈ అంశంలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే కర్ణాటక రాష్ట్రానికే అధిక ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి జిల్లాకు ప్రయోజనం చేకూర్చే భారీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గద్వాల, మక్తల్ ప్రాంతాల్లో ప్రాజెక్టుల పరిశీలన అనంతరం జేఏసీ నాయకులు సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. జూన్ 16 నుంచి 20 వరకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, తాజా మరియు మాజీ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసి చర్చలు జరపాలని నిర్ణయించినట్లు చెప్పారు. అదేవిధంగా రౌండ్ టేబుల్ సమావేశాలు, పాదయాత్రలు, ఉమ్మడి జిల్లా కేంద్రంలో ధర్నా, నియోజకవర్గ స్థాయి జేఏసీల ఏర్పాటు వంటి అంశాలపై జూన్ 16న నిర్వహించే ప్రత్యేక సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. డిండి లిఫ్ట్ పేరుతో జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, దానిని రద్దు చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. అలాగే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, చంద్రసాగర్--అమ్రాబాద్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల సాధనకు ప్రత్యేక కృషి అవసరమని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, నీటి హక్కుల సాధన కోరుకునే ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని టీజీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉద్యమానికి ఇప్పటివరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడం దేవుడెరుగు?

**అబద్ధాల పాలన ఆగం కాక తప్పదు**
**నందిమల్ల అశోక్ జిల్లా మీడియా కన్వీనర్**



(సమయం ప్రతినిధి వనపర్తి): హిట్లర్‌ను అనుసరిస్తున్న రేవంత్ రెడ్డి విధానాలు ఫాసిస్టు చర్యలను తలంపిస్తుంది. మహిళలను కోటీశ్వరులను చేసే ప్రక్రియలో భాగంగా ఆర్.టి.సి బస్సులకు మరియు పెట్రోల్ బంకులకు యజమానులు చేస్తే అని చెప్పి నేటికి ఏ బస్సుకు,ఏ పెట్రోల్ బంకులకు యజమానులను చేశారో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ డిమాండ్ చేశారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఈరోజు 400 బస్సులు కేటాయిస్తున్నామని ఆర్భాటం చేస్తూ ప్రారంభించడాన్ని మరోసారి మహిళలను మోసం చేయడమే అని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ దుయ్యబట్టారు. వివిధ డిపోలలో ఉన్న పాత బస్సులను కొత్తగా రంగులు వేసి రాజధానికి తరలించి నూతన బస్సులకు మహిళలను యజమానులను చేస్తున్నానని రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నాడు అశోక్ విమర్శించారు. వనపర్తి డిపోకు చెందిన బస్సులకు అలంపూర్ మహిళా సమాఖ్య అని పేర్లు స్టిక్కర్లు వేసి చూయించడం రేవంత్ రెడ్డి పాలనకు పరాకాష్ట నిజంగా మహిళలకు బస్సులు కేటాయించి ఆర్థికంగా అభివృద్ధి చేయాలనుకుంటే నూతన బస్సులు కొనుగోలు చేసి వారికి కేటాయించాలని అశోక్ డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన హామీల నుండి దృష్టి మళ్లించడానికి వాగ్దానం చేసిన పథకాలు ప్రతి మహిళకు 2500,తులం బంగారం,కె.సి.ఆర్ కిట్టు, గ్యాస్ సబ్సిడీ,స్కూటీలు ఇవ్వకుండా రోజుకో అబద్ధం చెబుతూ రేవంత్ రెడ్డి చేస్తున్న డ్రామాలు మహిళలు గమనిస్తున్నారని సరైన సమయంలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అశోక్ విమర్శించారు.

**బస్సుల కేటాయింపులో గందరగోళం**

మహిళా సమాఖ్య పేరిట కేటాయిస్తున్న బస్సులు ఆర్.టి. సి ఆపరేటింగ్ చేస్తుందా.... అందులో నుండి వచ్చే రాబడి తిరిగి సమాఖ్యకు చెల్లిస్తారా...ప్రత్యేకంగా సిబ్బందిని రిక్రూట్మెంట్ చేస్తారా వంటి అంశాలపై స్పష్టత లేదని అశోక్ అన్నారు. ప్రతి బహిరంగ సభకు మహిళలను తరలిస్తూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ వారి విలువైన సమయాన్ని వృథా చేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి రేవంత్ రెడ్డి ఆటంకం కలిగిస్తున్నాడని అశోక్ ఆరోపించారు. మహిళా ఓట్లతోనే మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవచ్చు అనే దుర్బుద్ధినీ మహిళలు తిప్పికొట్టి మీ పాలనకు మంగళం పాడడం ఖాయమని అశోక్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు నీలస్వామి,మైనార్టీ సెల్ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్,మండల యువత అధ్యక్షులు చిట్యాల.రాము ఉన్నారు.

## నల్లగొండలో దారుణం
## బండరాళ్లతో బాది యువకుడి ఘోర హత్య



సమయం ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున ఒక ఘోర హత్య కలకలం రేపింది. మిర్యాలగూడ రోడ్డు శివారులోని హ్యాపీ హోమ్స్ ఎదురుగా ఉన్న ఒక వెంచర్‌లో ఓ యువకుడిని దుండగులు అత్యంత పశువికారంగా చంపేశారు. ఈ ఘటనతో నల్లగొండ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మృతుడిని గొల్లగూడ పెద్దబండ పరిధిలోని సత్యనారాయణ కాలనీకి చెందిన బోతు సాయిగా పోలీసులు గుర్తించారు. దుండగులు సాయిని నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి, తీవ్రమైన కక్షతో బండరాళ్లతో ముఖంపై, తలపై మోదినట్లు తెలుస్తోంది. తల పూర్తిగా చిద్రమై, మెదడు బయటకు వచ్చేలా దారుణంగా కొట్టి చంపడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే శాలిగౌరరం ఇన్‌చార్జ్ సిఐ రాఘవరావు (టూ టౌన్ సిఐ), తిప్పర్తి ఎస్ఐ శంకర్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీమ్ వేలిముద్రలు, ఇతర సాక్ష్యాలను సేకరించింది. నిందితులు పారిపోయిన మార్గాన్ని గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగి క్షుణ్ణంగా పరిశీలించాయి. "ప్రాథమిక పరిశీలన ప్రకారం ఇది ముందస్తు ప్రణాళికతో జరిగిన హత్యగానే భావిస్తున్నాం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించాం. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ఆధారాలను సేకరిస్తున్నాయి. త్వరలోనే నిందితులను పట్టుకుని చట్టం ముందు నిలబెడతాం." అని సిఐ రాఘవరావు, ఎస్ఐ శంకర్ మీడియాకు తెలిపారు. మరోవైపు సాయి హత్య వార్త తెలియగానే అతని కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. పట్టణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున వెంచర్ వద్దకు చేరుకోవడంతో అక్కడ భారీ జనసందోహం కనిపించింది. ప్రస్తుతం ఈ కేసును తిప్పర్తి పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. పాత కక్షల వల్లే ఈ హత్య జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

## 75 లక్షల టన్నుల మార్కు రికార్డు స్థాయిలో వరి...

హైదరాబాద్ : వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. 2025-26 యాసంగి (రబీ) సీజన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణంలో, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని ప్రణాళికశాఖ నివేదిక స్పష్టం చేసింది. సాధారణంగా నీటి కొరత కారణంగా దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో వానాకాలం (ఖరీఫ్)తో పోలిస్తే యాసంగిలో వరి సాగు చాలా తక్కువగా ఉంటుంది. కానీ తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో 59.90 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం మీద జరిగిన యాసంగి వరి సాగు విస్తీర్ణంలో సగానికి పైగా వాటా కేవలం తెలంగాణదే కావడం విశేషం. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో 30.76 లక్షల ఎకరాలు, ఆంధ్రప్రదేశ్‌లో 17.29 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. ఇక వానాకాలం, యాసంగి రెండు సీజన్లను కలిపి చూస్తే.. అత్యధిక సాగు విస్తీర్ణంలో ఉత్తరప్రదేశ్ దేశంలోనే తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది.వరి సాగులోనే కాకుండా ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. శనివారం నాటికి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు 72.30 లక్షల టన్నులకు చేరాయి. కొనుగోళ్లు మరో వారం పాటు సాగనుండటంతో ఈ సంఖ్య సులభంగా 75 లక్షల టన్నుల మార్కును దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా.. మన పొరుగున ఉన్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మొత్తం కొనుగోళ్లు కలిపినా 40 లక్షల టన్నుల లోపే ఉండటం గమనార్హం.తెలంగాణలో ఈ స్థాయి దిగుబడి రావడానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రాజెక్టుల ద్వారా నిరంతర నీటి లభ్యత, వ్యవసాయ రంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 అదనపు బోనస్ అందించటం, పకడ్బందీగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కారణంగా సాగు విస్తీర్ణం పెరిగిందని అంటున్నారు.

# రేవంత్ రెడ్డికి ఏటీఎంలుగా మారిన ప్రాజెక్టులు







**ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వానిది వైఫల్యమే..**
**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు**

**సమయం ప్రతినిధి, నల్లగొండ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో నడుస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు తీవ్రంగా విమర్శించారు. యాదాద్రిలో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. మూసి నది ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని రామ్ చందర్ రావు స్పష్టం చేశారు. అయితే, ఈ ప్రాజెక్టు పేరుతో సాగుతున్న 'గాంధీ సారోవర్ ప్రాజెక్టు' రూపకల్పనను మాత్రమే తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతుల సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం, కేంద్రంపై తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నిధులను కేంద్రమే రియంబర్స్మెంట్ (తిరిగి చెల్లింపు) రూపంలో ఇస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కేంద్రం సేకరించిన మొత్తం ధాన్యంలో దాదాపు 50 శాతం కేవలం తెలంగాణ నుంచే కొనుగోలు చేశామని ఆయన గణాంకాలతో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనీస అవగాహన లేకపోవడం వల్లే ఈ ఏడాది ధాన్యం దిగుబడిని సరిగ్గా అంచనా వేయలేకపోయిందని, కేంద్రానికి ధాన్యం సేకరణపై సరైన ఇండెంట్ కూడా సమర్పించలేదని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజెపి నేతలపై ఇష్టమొచ్చినట్లు, ఏది పడితే అది మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బిజెపి తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో తిరగలేరని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై చర్యలు తీసుకుంటామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు మాట తప్పుతోందని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను కాపాడేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు అవి నీతి విచారణపై రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తోందని రామ్ చందర్ రావు ఆరోపించారు.

## ఫూలే-అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్



**(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) :** మహబూబ్ నగర్ నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఫూలే-అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణ పనులను గౌరవ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనులను నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం తగ్గకుండా త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. రీడింగ్ రూంలు, కాన్ఫరెన్స్ హాల్, తరగతి గదుల నిర్మాణాలను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఫూలే-అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ మహబూబ్ నగర్‌కు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గతంలో సూచించిన డిజైన్ ప్రకారం నిర్మాణాలు కొనసాగించాలని, ముఖ్యంగా ముఖ ద్వారం ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని తెలిపారు. రీడింగ్ రూంలలో నాలెడ్జ్ సెంటర్‌కు వచ్చిన విద్యార్థులు ప్రశాంతంగా కూర్చొని చదువుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని, అలాగే ఓపెన్ హాల్ సీటింగ్ విధానం ఉండేలా, అలాగే ఓపెన్ ఏరియాలో అందమైన గార్డెన్ ఏర్పాటుచేసి సందర్శకులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నాయకులు లీడర్ రఘు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వాహనాల పాత విడిభాగాల బహిరంగ వేలం విజయవంతం : అదనపు ఎస్పీ రాజేష్ మీనా

**అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహణ**
**పోటాపోటీగా పాల్గొన్న వ్యాపారులు -వేలంలో పాత టైర్లు, బ్యాటరీలు, విడిభాగాలు సొంతం**
**వ్యాపారుల భారీ స్పందన మధ్య పోలీసు వేలంపాట ఘన విజయం**



**వనపర్తి :** మంగళవారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, బ్యాటరీలు మరియు ఇతర వాహన విడిభాగాల బహిరంగ వేలం విజయవంతంగా నిర్వహించారు. వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, శ్రీ ఏ ఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి పర్యవేక్షణలో జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ఈ వేలంపాటను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించారు. వేలంపాటలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా బిడ్లు దాఖలు చేశారు. పోలీసుశాఖ వినియోగంలో లేని పాత టైర్లు, బ్యాటరీలు మరియు ఇతర వాహన విడిభాగాలను 82,600 రూపాయలకు సొంతం చేసుకున్నారు. వేలంపాట ప్రక్రియ మొత్తం ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించబడిందని అధికారులు తెలిపారు. పాల్గొన్న వ్యాపారులు కూడా వేలంపాట నిర్వహణ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు వాహనాల అధికారి (ఎం.టి.ఓ.), రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పోలీసు శాఖ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తూ వేలంపాటను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ వేలం పాటలలో మోటార్ వాహనాల రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, వినోద్, మగ్దుమ్ బారి, కొనుగోలుదారులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



## మిర్యాలగూడలో పేదల సొంతింటి కల సాకారం

**పంపిణీకి సిద్ధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు**
**గత ప్రభుత్వానివి ఓట్ల రాజకీయం.. మాది ప్రజా ప్రభుత్వం: మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**
**త్వరలోనే మంత్రుల సమక్షంలో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ**





**సమయం ప్రతినిధి, నల్లగొండ:** గత పదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించిందని, త్వరలోనే రాష్ట్ర మంత్రుల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులకు ఈ ఇళ్లను అధికారికంగా పంపిణీ చేస్తామని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి ఇళ్ల సముదాయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, మౌలిక వసతుల ఏర్పాట్లను సమీక్షించారు. మిర్యాలగూడ పట్టణంలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను పూర్తి చేయడమే కాకుండా, అక్కడ నివసించడానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి ఇళ్ల సముదాయాన్ని స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్, తాగునీరు, అంతర్గత రోడ్లు వంటి పనులను అధికారులు నాణ్యతతో పూర్తి చేయడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో రాజీవ్ గృహ కల్ప పథకం కింద మంజూరైన ఈ స్థలంలో.. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ఇళ్ల నిర్మాణం పేరుతో 10 ఏళ్లలో మూడుసార్లు ప్రత్యేక నిధులను మంజూరు చేయించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ పనులు పూర్తి చేయకుండా, ఈ ఇళ్లను కేవలం పేదలకు చూపిస్తూ రాజకీయం చేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.

ఎన్నికల ముందు కనీసం తాగునీరు, రోడ్డు, విద్యుత్ లాంటి కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా, కేవలం ఓట్ల కోసం డ్రా సిస్టమ్ పెట్టి ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. "మేము అధికారంలోకి వచ్చిన గత 6 నెలలుగా ఈ ప్రాజెక్టుపై నిత్యం పర్యవేక్షణ ఉంచాం. రాష్ట్ర మంత్రులు, అధికారుల సహకారంతో ప్రత్యేక నిధులను మంజూరు చేయించి, ఇక్కడ నివసించడానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులను పూర్తి చేయించాం. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే మా ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.
ఎలాంటి ఆలస్యం లేకుండా, త్వరలోనే రాష్ట్ర మంత్రుల ముఖ్య ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు పూర్తి పారదర్శకంగా ఈ ఇళ్లను అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలకృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్, జాతీయ మాలమహానాడు అధ్యక్షులు తాళ్లపల్లి రవి, సర్పంచ్ బెజ్జం సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సాగర మథనం సామాజిక సంకల్పం

**సముద్రపు అలలను చూస్తే భయపడేవారు ఎందరో. కానీ, ఆ అలలనే ఆభరణాలుగా ధరించి సముద్ర గర్భంలోనే విజయాలను వెతుక్కునే సాహస నారీమణులు కొందరుంటారు. అలాంటి వారిలో ఒకరు తెలంగాణ స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా. క్రీడాకారిణిగా విజయాలు సాధించడమే కాదు.. తన అభిరుచిని సామాజిక బాధ్యతతో ముడిపెట్టి ఎందరికో స్ఫూర్తినిచ్చే దీపస్తంభంలా నిలుస్తున్నారు. ఇటీవల ఐదుగురు మహిళలతో కూడిన బృందానికి నాయకత్వం వహించి 'రామసేతు' (పాక్ జలసంధి) ను ఈదిన ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..** సమయం ప్రతినిధి

మొదటి పేజీ తరువాయి

'నేను, నా కొడుకు.. మేమిద్దరం ఈదుతున్నాం అని చెప్పుకోవడం కేవలం గొప్పకోసమేనా? మన చుట్టూ ఎంతోమంది ప్రతిభావంతులు సరైన అవకాశాలు లేక వెనుకబడిపోతున్నారు. వారిని మనం ఎందుకు ప్రోత్సహించకూడదు'.. ఈ ప్రశ్న నన్ను చాలా రోజులు తొలిచేసింది. ఓపెన్ వాటర్ స్విమ్మింగ్‌లో అద్భుత ప్రతిభ ఉన్న వారిని వెలుగులోకి తేవాలనే తపన నాలో మొదలైంది. అదే సమయంలో మా అమ్మాయి క్లాస్‌మేట్ అయిన 22 ఏళ్ల యువకుడు డ్రగ్స్ మత్తులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోవడం నన్ను కలచివేసింది. ఆ తల్లిదండ్రుల వేదనను దగ్గరగా చూశాక ఒక తల్లిగా నా గుండె తరుక్కుపోయింది. 'బిడ్డలున్న తల్లిగా ఈ సమాజానికి ఏదైనా చేయాలి' అని ఆ క్షణమే నిశ్చయించుకున్నాను. మత్తుపదార్థాల మహమ్మారిపై అవగాహన కల్పించడానికి, నా ప్రాణమైన స్విమ్మింగ్‌నే ఆయుధంగా ఎంచుకున్నాను. నాలాంటి తల్లులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి మా ద్వారా ఈ సందేశాన్ని బలంగా వినిపించాలనుకున్నాను. అలా శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి మన ధనుష్కోడి వరకు సాగర యాత్రకు అంకురార్పణ చేశాను.

## బృంద నిర్మాణం.. ఆటంకాలు

ఒక మంచి లక్ష్యం కోసం భయమంటే తెలియని మహిళా స్విమ్మర్లను వెతకడం ఎంత కష్టమో అప్పుడే నాకు తెలిసొచ్చింది. ఈత వచ్చినవారు లక్షల్లో ఉంటారు. కానీ, అల్లకల్లోలంగా ఉండే సముద్రంలో ఈదగల ధైర్యవంతులు కావాలి. ఆరు నెలలపాటు దేశమంతా తిరిగాను. ఢిల్లీ, విజయవాడ, పుణె, కర్ణాటక.. ఇలా ఎన్నో చోట్ల ఓపెన్ వాటర్ స్విమ్మర్లను కలిశాను. ఎన్నో తిరస్కరణలు, అడ్డంకులు ఎదుర్కొన్న తర్వాత చివరికి ఆరుగురితో ఒక బృందాన్ని సిద్ధం చేయగలిగాను. మా బృందంలో నాతోపాటు పుణె నుంచి స్మిత, తెలంగాణ నుంచి మౌనిక, ఢిల్లీ నుంచి ఆర్తి, విజయవాడ నుంచి రాధిక, రజని ఉన్నారు. అంతా సిద్ధమై భారత్, శ్రీలంక ఎంబసీల నుంచి అనుమతులు కూడా వచ్చాక యాత్రకు కేవలం మూడు రోజుల ముందు ఊహించని షాక్ తగిలింది. రజని తనవల్ల కాదని చెప్పింది. ఆరుగురి పేర్లపై అనుమతులు రావడంతో కొత్తవారిని చేర్చుకునే అవకాశం లేకుండా పోయింది. ఆరుగురి కోసం వేసుకున్న ప్రణాళికను ఐదుగురితో పూర్తిచేయాల్సి రావడంతో మా అందరిపైనా మానసికంగా, శారీరకంగా పెనుభారం పడింది. ప్రతి ఒక్కరి విశ్రాంతి సమయం తగ్గిపోయింది. అయినా ఒక నాయకురాలిగా నా బృందంలో ధైర్యం నింపి, ముందుకు నడిపించాల్సిన బాధ్యత నాపై ఉందని దృఢంగా నిశ్చయించుకున్నాను.

అలలపై సాహస యాత్ర

ఏప్రిల్ 25న అర్ధరాత్రి దాటాక 2 గంటలకు శ్రీలంకలోని తలైమన్నార్ తీరంలో చిమ్మచీకటిని చీల్చుకుంటూ మా యాత్ర మొదలైంది. ఎగసిపడే అలల మధ్య, ఒకరి తర్వాత ఒకరు గంట చొప్పున ఈదుతూ ముందుకు సాగాం. సముద్రంలో ఉండే జెల్లీఫిష్‌ల నుంచి రక్షణ కోసం అమెరికా నుంచి ప్రత్యేకమైన క్రీములు తెప్పించుకున్నాం. సాధారణంగా స్విమ్మర్లకు రాత్రిపూట చిన్న లైట్లు ఇస్తారు. కానీ జెల్లీఫిషలను ఆ కాంతి ఆకర్షిస్తుందని లైట్లు లేకుండానే ఈదాల్సి వచ్చింది. మా వెంట వచ్చే మదర్‌బోట్ వెలుగులే మాకు దారిచూపాయి. ఈ యాత్రలో నా బృంద సభ్యులు అద్భుతమైన పట్టుదల చూపారు. ముఖ్యంగా మౌనిక, ఆర్తి తమ వేగంతో ఎక్కువ దూరం కవర్ చేసి మాకు అండగా నిలిచారు. బృందంలో పెద్దవారైన 52 ఏళ్ల స్మిత ఆరోగ్య సమస్యలు ఉన్నా వెనుకడుగు వేయలేదు. 49 కిలోమీటర్ల ఈ సుదీర్ఘ యాత్రను 10 గంటల 10 నిమిషాల్లోనే పూర్తిచేసి ఏప్రిల్ 26న మధ్యాహ్నం ధనుష్కోడి తీరాన్ని చేరుకున్నాం. భారత జలాల్లోకి అడుగుపెట్టగానే ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులు మాకు స్వాగతం పలికిన క్షణం నా జీవితంలో మర్చిపోలేను. బెంగళూరుకు చెందిన సతీశ్ 'స్విమ్ లైఫ్' ఆర్గనైజేషన్ ద్వారా నాకు ఓపెన్ వాటర్ స్విమ్మింగ్‌లో అవకాశం వచ్చింది. ఇప్పుడు ఆయన పర్యవేక్షణలోనే ఈ సాహసయాత్రను పూర్తిచేశాం. అలాగే 'యూనిఫ్లై' సంస్థ స్పాన్సర్‌షిప్ లేకపోతే ఈ యాత్ర సాధ్యమయ్యేది కాదు.

## గుర్తింపు కోసం..

ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ ప్రాణాలతో చేసే సాహసం. ఎవరెస్ట్ ఎక్కిన వారికి లభించే గుర్తింపు.. సముద్రాలను జయించే మాకు ఎందుకు లభించడం లేదనేది నా ఆవేదన. ప్రభుత్వం నుంచి చేయూత లభిస్తే మిగిలిపోయిన నాలుగు సముద్రాలను కూడా ఈది భారత కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగరేస్తాను. ప్రస్తుతం ఎల్బీ స్టేడియంలో సంతోష్‌చారి వద్ద శిక్షణ పొందుతున్నాను. నా తదుపరి లక్ష్యం నా కుమార్తె, కొడుకుతో కలిసి సముద్రం ఈది తల్లి, కొడుకు, కూతురు కలిసి ఈదిన తొలి కుటుంబంగా ప్రపంచ రికార్డు సృష్టించడం. నా ప్రయాణంలో మావారు అనిల్ కుమార్ సహా ఎంతోమంది అండగా నిలిచారు.





వారందరికీ కృతజ్ఞతలు. పట్టుదల ఉంటే వయసు, విమర్శలు, ఆర్థిక ఇబ్బందులు ఏవీ మనల్ని ఆపలేవని నిరూపించడమే నా లక్ష్యం. మరిన్ని విజయాలతో దేశానికి గర్వకారణంగా నిలవాలన్నదే నా ఆశ, ఆశయం.

## విమర్శలే విజయానికి సోపానం

నిజానికి నా ఈ ప్రస్థానం 2018లో నా పిల్లల వల్లే మొదలైంది. ఫ్యాషన్ డిజైనర్‌గా బర్కత్‌పురలో 'క్వీన్స్ ఫ్యాషన్ స్టూడియో' నడుపుతున్న నేను.. నా పిల్లలు ఎలిజబెత్ క్వీన్, స్టీఫెన్ కుమార్‌ను చూసి స్ఫూర్తి పొందాను. నేను కూడా పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాను. వారిద్దరూ నేషనల్ స్విమ్మర్లు. ప్రపంచంలో అత్యంత కఠినమైన ఏడు సముద్రాల్లో మూడింటిని (ఇంగ్లిష్ చానల్, కాటలినా చానల్, కుక్ జలసంధి) ఈదాను. కుక్ స్ట్రెయిట్‌ను ఈదిన తొలి దక్షిణ భారత మహిళగా రికార్డు సృష్టించాను. నా కొడుకు స్టీఫెన్‌తో కలిసి ఈదాను. ప్రపంచంలో తల్లితో కలిసి సముద్రాలు ఈదిన మొట్టమొదటి కొడుకుగా స్టీఫెన్ రికార్డుల కెక్కాడు. ఇన్ని విజయాలు సాధిస్తున్నా, ఎన్నో విమర్శలు నన్ను వెంటాడాయి. 'ఆమె ఇంగ్లిష్ చానల్ ఈదలేదు.. దేశం పరువు తీస్తుంది' అని కొందరు, 'ఆమె తెలంగాణ స్విమ్మర్ కాదు' అని మరికొందరు అన్నప్పుడు బాధ కలిగినా, ఆ విమర్శలనే నా విజయానికి సోపానాలుగా మార్చుకున్నాను.

# ప్రజాప్రయోజన వ్యయాలు పెరగాలి!




**సమయం ప్రతినిధి:** ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా చేస్తోన్న యుద్ధం సుదూర యుద్ధం కానేకాదు. భారత ఉపఖండానికి పొరుగున ఉన్న పశ్చిమాసియాలో సాగుతోన్న సమరమది. ఆ ప్రాంతంలో లక్షలాది భారతీయులు నివసిస్తున్నారు, జీవనోపాధి పొందుతున్నారు. మన దేశంలోని కోట్లాది షియా ముస్లింలకు ఇరాన్ ప్రజలతో ఆత్మీయ అనుబంధాలు ఉన్నాయి. ఇరాన్‌తో భారత్‌కు సుదీర్ఘ, చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఇరాన్‌తో వాణిజ్య, ఆర్థిక సంబంధాలు సైతం బలోపేతమయ్యాయని భారత్ చెబుతోంది. ఇందుకు ఉదాహరణగా చాబహార్ ఓడరేవు అభివృద్ధిని ప్రముఖంగా పేర్కొనడం కద్దు. అయితే బీజేపీ ప్రభుత్వ హయాంలో ఈ సంబంధాల ప్రగాఢత తగ్గిపోయింది. కారణాలు అనేకమున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఉన్న సన్నిహిత స్నేహబంధం ఆ కారణాలలో ఒకటి.

మొన్నగాక అటు మొన్నటి వరకు ప్రపంచంలో ఎక్కడ ఘర్షణలు ప్రజ్వరిల్లినా శాంతి సాధనకు భారత్ సహాయం అర్థించడం, తీసుకోవడం పరిపాటిగా ఉండేది. ఫిబ్రవరి 28, 2026న ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించిన అమెరికా, ఇజ్రాయెల్‌లు మొదటి నుంచీ భారత్‌ను దూరంగా పెడుతున్నాయి. ఇరాన్ మాత్రమే యుద్ధ పరిణామాలను, తమ వైఖరిని న్యూఢిల్లీకి వివరించేందుకు కాస్తో కూస్తో శ్రద్ధ చూపుతోంది. ఇజ్రాయెల్ పక్షపాతిగా భారత్ వ్యవహరిస్తోంది. ఆ యూదు దేశాన్ని విమర్శించిన బ్రిక్స్ దేశాల ముసాయిదా తీర్మానాన్ని భారత్ వీటో చేయడమే అందుకొక తాజా నిదర్శనం. అయినప్పటికీ అమెరికా- ఇజ్రాయెల్‌లు భారత్‌తో సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నాయి. ఇరాన్‌తో మధ్యవర్తిత్వం నెరిపేందుకు పాకిస్థాన్ సహాయాన్నే అవి అపేక్షిస్తున్నాయి, తీసుకుంటున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం మన ఆర్థిక జీవనాన్ని పెద్దగా ప్రభావితం చేయడం లేదనే భారత్ ఇంకెంతమాత్రం చెప్పలేదు. అలా చెప్పడం ఆత్మవంచనే అవుతుంది. ఎందుకంటే ఆ యుద్ధం వల్ల ఇప్పటికే చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలకు భారీ నష్టం వాటిల్లింది. భారత్ సైతం అందుకు మినహాయింపు కాదు. సరే, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హూంకరింపులు, బెదిరింపులకు ప్రపంచ దేశాలు అలవాటు పడిపోయాయి. ఇరాన్ నావికా, వైమానిక దళాలను పూర్తిగా తుడిచి పెట్టేశామని ఆ మహాశయుడు ప్రకటించినప్పుడు ఎవరూ ఆయన మాటను విశ్వసించలేదు. ఇరానియన్ సైనిక ఆస్తులు అన్నిటినీ భస్మీపటలం చేశామని కూడా ఆయన ప్రకటించారు; అంతేనా? ఇరాన్ 'పాలన' మారిందని కూడా ఆయన ఘోషించారు. శాంతి సాధనకు అమెరికా ముసాయిదా ప్రతిపాదనలను ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ గట్టిగా చెప్పారు; వివిధ సందర్భాలలో కాల్పుల విరమణ గురించి కూడా ఆయన గొప్పగా ప్రకటించారు. డోనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని ఆపివేశారు, మళ్లీ ప్రారంభించారు, పిదప కాల్పుల విరమణను ప్రకటించారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ నిరవధికంగా ఇరాన్, లెబనాన్‌లపై దాడులు నిర్వహిస్తూనే ఉన్నది, ఇరాన్ ముమ్మరంగా ప్రతిదాడులూ చేస్తోంది. ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం అసలు ఆగిపోనేలేదనే వాస్తవం ప్రపంచానికి బాగా తెలుసు. సమర జ్వాలలు మనలను తాకడం లేదా? లేదు, అంతా 'సాధారణంగా' ఉందని ప్రభుత్వం చెబుతోంది. యుద్ధ నష్టాలు, పర్యవసానాల గురించి ఆర్బీఐకు సరైన అవగాహన ఉన్నట్టుగా కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ సరఫరాల గొలుసులపై ఒత్తిడి, ఇంధనం, ఆహార ధరల ఎదుగుదలతో 'ముమ్మరమైన ద్రవ్యోల్బణం', 'దిగుమతుల తగ్గుదల', 'విదేశీ సంస్థాగత పెట్టుబడుల ప్రవాహం తగ్గిపోవడం' మొదలైన సమస్యల గురించి ఆర్బీఐ బులెటిన్ (ఏప్రిల్, 2026) స్పష్టంగా పేర్కొంది. యుద్ధం కొనసాగి, సరఫరా గొలుసుల పునరుద్ధరణలో జాప్యం జరిగితే మన ఆర్థిక వ్యవస్థకు విషమ సమస్యలు వాటిల్లుతాయని' ఆర్బీఐ హెచ్చరించింది. ఈ సమస్యల నివారణకు దేశ పాలకులు ఏమైనా చేస్తున్నారా? పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా చర్యలు చేపట్టారు. నిజమే. అయితే నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న కారణంగానే ఆ ధరలను అదుపు చేశారు. అంతకు మించి వారు చేసిందేమీ లేదనడం సత్యదూరం కాదు. ప్రధానమంత్రి నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో తమ పార్టీ విజయావకాశాలను మెరుగుపరచడంపై దృష్టి కేంద్రీకరించారు. సెప్టెంబర్ 2023లో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన మహిళా రిజర్వేషన్ అంశాన్ని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి కొత్త రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం పొందేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మే 5న ఆయన మళ్లీ దేశ పాలనా వ్యవహారాలపై తన దృష్టిని కేంద్రీకరిస్తారు. ఇరాన్ యుద్ధంతో ఆర్థిక ఉపద్రవాలకు లోనవుతున్న దేశ ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం ఇంకా ఎంతో చేయవలసి ఉన్నది. ఆదాయాలను పెంపొందించినప్పుడే ప్రజలకు జీవన సౌలభ్యం సమకూరుతుందనే వాస్తవాన్ని విస్మరించకూడదు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసినవారికి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. ఆ పథకాన్ని రద్దు చేసి, సరికొత్త పథకాన్ని ప్రారంభించిన నాటినుంచీ అనిశ్చితిలో ఉన్న ఉపాధి పనుల కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలి; గ్రామీణ రోడ్ల నిర్మాణ కార్యక్రమం అమలును వేగవంతం చేయాలి. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఆ కార్యక్రమానికి కేటాయించిన రూ.19,000 కోట్లను ఆరు నుంచి ఎనిమిది నెలల్లోగా వ్యయపరచాలి. మరిన్ని నిధులను గ్రామీణ రోడ్ల నిర్మాణానికి కేటాయించాలి; 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాగునీటి పథకం జల్ జీవన్ మిషన్‌కు బడ్జెట్ అంచనా రూ.67,000 కోట్లు మాత్రమే కాగా, సవరించిన అంచనా కేవలం రూ.17,000 కోట్లు మాత్రమే! 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆ పథకానికి రూ.67,670 కోట్లు కేటాయించారు. తాగునీటి సదుపాయాల కల్పనకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పెరుగుదల సూచిస్తుంది. కేటాయించిన నిధులను వెన్వెంటనే రాష్ట్రాలకు విడుదల చేసి, ఆ పథకం సత్వర అమలుకు కేంద్రం శ్రద్ధ చూపాలి; కోవిడ్ విలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి ప్రభుత్వం వాగ్దానమిచ్చినప్పటికీ దానిని నెరవేర్చనేలేదు. ఉపాధి అవకాశాలను ఇతోధికంగా కల్పించగల ఆ పరిశ్రమ రంగానికి ఇప్పుడు రుణాలు తక్షణమే మంజూరు చేయాలని బ్యాంకులను ఆదేశించాలి. అవి పురోగమన బాట పట్టాలంటే ఇది తప్పనిసరి. ప్రజా శ్రేయస్సుకు దోహదం చేసే రోడ్ల నిర్మాణం మొదలైన పనులకు, విద్య, ఆరోగ్య భద్రత మొదలైన అత్యవసర సేవలకు చేసే వ్యయాలను భారీగా పెంచాలి. ట్రంప్-నెతన్యాహు ద్వయం ప్రారంభించిన యుద్ధం నష్టాలు, బాధాకర పర్యవసానాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజాప్రయోజన వ్యయాలే సరైన ప్రభావదాయక ప్రతిచర్యలు అవుతాయన్న వాస్తవాన్ని పాలకులు విస్మరించకూడదు.



# గర్భస్రావాలకు అడ్డుకట్ట

**వేర్వేరు త్రైమాసికాల్లో జరిగే గర్భస్రావాలకు వేర్వేరు కారణాలుంటాయి. ఆరోగ్య సమస్యలు, జన్యు సమస్యలు మొదలు గర్భాశయ నిర్మాణంలో లోపాల వరకూ అనేక కారణాలు గర్భస్రావాలకు దారి తీస్తాయి. కాబట్టి కారణాన్ని కనిపెట్టి తదనుగుణమైన చికిత్సలను ఆశ్రయించాలంటున్నారు వైద్యులుగర్భధారణను మూడు త్రైమాసికాల్లో విభజిస్తే, మొదటి త్రైమాసికంలోనే గర్భస్రావ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.**

సమయం ప్రతినిధి

**మొదటి త్రైమాసికం:** గర్భం దాల్చిన మొదటి మూడు నెలల్లో జరిగే గర్భస్రావాలకు క్రోమోజోమ్స్‌లో లోపాలు ప్రధాన కారణం. అండం, వీర్యం ఆరోగ్యంగానే ఉన్నప్పటికీ, అవి రెండూ కలిసి పిండం తయారైనప్పుడు, దాన్లో క్రోమోజోమల్ మల్టిప్లికేషన్ సక్రమంగా జరగని సందర్భాల్లో, లోపాలతో కూడిన పిండం ఏర్పడుతుంది. ఈ పిండానికి పెరిగే స్వభావం ఉండదు కాబట్టి దానంతట అదే గర్భస్రావం ద్వారా బయటకు వచ్చేస్తుంది. భార్యాభర్తల కుటుంబాల్లో క్రోమోజోమ్ సంబంధిత సమస్యలున్నప్పుడు కూడా గర్భాశయంలో అసాధారణ పిండాలు ఏర్పడి, గర్భస్రావానికి దారి తీస్తాయి

**రెండో త్రైమాసికం:** మూడో నెల దాటిన తర్వాత గర్భస్రావానికి ప్రధాన కారణం... 'సర్వైకల్ ఇన్‌కాంపిటెన్స్'. ప్రసవ సమయంలో తెరుచుకుని, మూసుకుపోవలసిన గర్భసంచి ద్వారమైన సర్విక్స్, కొందరికి వదులుగా ఉంటుంది. నెలలు నిండేకొద్దీ శరీరంలో చోటుచేసుకునే హార్మోన్ల మార్పుల వల్ల, పెరిగే బరువు వల్ల పిండం సర్విక్స్ గుండా బయటకొచ్చేస్తుంది. అలాగే కొందరికి గర్భసంచి నిర్మాణంలో లోపాలుంటాయి. ఇలా పుట్టుకతోనే గర్భాశయ సమస్యలను వెంట తెచ్చుకున్న గర్భిణులు రెండో త్రైమాసికంలో గర్భస్రావ సమస్యను ఎదుర్కోవచ్చు. కొందరికి గర్భాశయ నిర్మాణ లోపాలతో పాటు, సర్వైకల్ ఇన్‌కాంపిటెన్స్ కూడా ఉండొచ్చు.

**మూడో త్రైమాసికం:** 24 వారాలు దాటిన తర్వాత జరిగే గర్భస్రావాన్ని ప్రి టర్మ్ లేబర్‌గా పరిగణించాలి. ఈ పరిస్థితి 25 వారాల నుంచి 35 వారాల్లోపు తలెత్తవచ్చు. సాధారణంగా గర్భంలో పెరిగే బిడ్డ 37 వారాలకు పూర్తి పరిణతి పొంది, 40 వారాలకు ప్రసవం ద్వారా బయటి ప్రపంచంలోకి అడుగు పెడుతుంది. కాబట్టి 37 వారాల్లోపు జరిగే ప్రసవాలన్నిటినీ ప్రి మెచ్యూర్‌గానే పరిగణించాలి. 34 నుంచి 37 వారాల్లోపు ప్రసవమైతే ప్రి మెచ్యూర్‌గా, 34 వారాల్లోపు జరిగే ప్రసవాన్ని వెరీ ప్రి మెచ్యూర్‌గా వైద్యులు పరిగణిస్తారు. గర్భాశయ నిర్మాణంలో లోపాలు, సర్విక్స్ వదులుగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. ఏడు, ఎనిమిది నెలల్లో జరిగే ప్రసవాలన్నీ ఈ కోవకు చెందినవే! అలాగే మధుమేహం ఉన్న మహిళలు, వెజైనల్ ఇన్‌ఫెక్షన్లు గర్భసంచికి వ్యాపించిన మహిళల్లో, ఉమ్మసంచిలోని మెంబ్రేన్స్‌కు ఇన్‌ఫెక్షన్ సోకి, అది త్వరగా బ్రేక్ అయిపోయి, ప్రసవమైపోతుంది.

## ప్రిమెచ్యూర్ లేబర్

అధిక బరువు, పిసిఒడి, మధుమేహ కుటుంబ చరిత్ర, కదలకుండా గంటల తరబడి పని చేయడం, అస్తవ్యస్థ జీవనశైలి, ఆహారశైలి వల్ల మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు పెరుగుతున్నాయి. గర్భధారణ వయసు ఎంత ఆలస్యమైతే, మధుమేహం, అధిక రక్తపోటు ముప్పు అంత ఎక్కువగా ఉంటుంది. గర్భిణుల్లో 6 నుంచి 8 నెలల్లో మధుమేహం, అధిక రక్తపోటు పెరగడం, ఫలితంగా బిడ్డకు రక్తప్రసరణలో లోపం తలెత్తి, ఆక్సిజన్, పోషణ అందక కడుపులోనే బిడ్డ చనిపోయే అవకాశాలు ఉండడం వల్ల అంతకంటే ముందే వైద్యులు, గర్భిణులను ప్రి మెచ్యూర్ లేబర్‌కు గురి చేయక తప్పడం లేదు. ఇలాంటి సందర్భాల్లో గర్భిణి, బిడ్డ ఆరోగ్య పరిస్థితి ఆధారంగా సాధారణ ప్రసవం చేయవచ్చా, లేదంటే సర్జరీని ఆశ్రయించాలా? అన్నది వైద్యులు నిర్ణయిస్తారు. కొందరు గర్భిణుల్లో అధిక రక్తపోటు వల్ల మెదడులో నీరు చేరి, మూర్ఛలొచ్చే అవకాశాలుంటాయి. వైద్యులు, ముందస్తు లక్షణాల ద్వారా ఈ పరిస్థితిని అంచనా వేసి, వెంటనే సిజేరియన్ చేసేస్తూ ఉంటారు.

## ఆరోగ్యాన్ని గాడిలో పెట్టుకుని...

గర్భస్రావాలకు ఆస్కారం లేకుండా నెలలు నిండి పండంటి బిడ్డను ప్రసవించాలనుకునే ప్రతి మహిళా, గర్భధారణకు ముందే ఆరోగ్య సమస్యలను సరిదిద్దుకుని, పరిపూర్ణ ఆరోగ్యాన్ని సమకూర్చుకోవాలి. ప్రి డయాబెటిక్ దశలో ఉన్న మహిళలు, ఆ సమస్యను ఆహార నియమాలు, వ్యాయామంతో నియంత్రించుకుని, ఆ తర్వాత ప్రెగ్నెన్సీకి ప్రయత్నించడం ఉత్తమం. ప్రి డయాబెటి?సతో గర్భం దాల్చినప్పుడు, గర్భంతో పెరిగే హార్మోన్ల వల్ల ప్రి డయాబెటిస్, డయాబెటి?సగా మారిపోతుంది. కాబట్టి ముందే జాగ్రత్త పడాలి. మధుమేహానికి మందులున్నప్పటికీ, గర్భంతో ఉన్నప్పుడు మధుమేహాన్ని అదుపు చేయడానికి కొన్ని అడ్డంకులు ఎదురవుతాయి. బిడ్డకు పోషణ అందాలి కాబట్టి ఆహార నియమాలు సాధ్యపడవు. అన్ని మందులూ వాడుకునే వీలుండదు. కాబట్టి ముందు నుంచే ఆరోగ్యాన్ని గర్భధారణకు అనువుగా ఉంచుకోవాలి. విటమిన్ లోపాలు, ఇన్‌ఫెక్షన్లు ఇతరత్రా ఆరోగ్య సమస్యలన్నిటినీ సరిదిద్దుకోవాలి.

## నెల తప్పిన వెంటనే...

సాధారణంగా మూడో నెల వరకూ గర్భిణులు వైద్యులను కలవవలసిన అవసరం లేదనుకుంటారు. కానీ మొదటి ఐదు నెలలే అత్యంత కీలకం. కాబట్టి నెల తప్పిన వెంటనే వైద్యులను కలవడం అవసరం. ముందు ఎలాంటి పరీక్షలూ చేయించుకోని గర్భిణులకు వైద్యులు అవసరమైన పరీక్షలు సూచిస్తారు. ఆహార నియమాలతో పాటు వ్యాయామాలనూ సూచిస్తారు. గర్భధారణకు ముందే వ్యాయామాలు చేయడం ఎంతో అవసరం. దీంతో శరీర పటుత్వం పెరుగుతుంది. అలాగే గర్భం దాల్చిన తర్వాత మొదటి ఐదు నెలలూ ఎక్కువ బరువు పెరగకూడదు. ఇద్దరు మనుషులకు సరిపడా తినాలని ఎక్కువ తినడం వల్ల బరువు పెరిగితే, ఐదో నెలకే అధిక రక్తపోటు, మధుమేహం వచ్చేస్తాయి. కాబట్టి గర్భిణులు ప్రతి నెలా వైద్యులను కలుస్తూ, బరువును అదుపులో ఉంచుకుంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలి.

## ముందస్తు చికిత్సలతో...


గర్భస్రావాలకు కారణమైన ఫైబ్రాయిడ్స్‌ను సర్జరీతో తీయించుకోవాలి. గర్భాశయ నిర్మాణంలో లోపాలుంటే వాటిని సరిచేయించుకోవాలి. మూడో నెలలో సర్విక్స్ వదులుగా ఉందని తేలితే, కుట్టుతో సరిచేసుకోవచ్చు. క్రోమోజోమ్ సమస్యలను చికిత్సతో సరిదిద్దే వీలుండదు. కాబట్టి సహజసిద్ధంగా గర్భధారణ జరిగే వరకూ ఎదురుచూడక తప్పదు.

## అపోహలు - వాస్తవాలు

బొప్పాయి తింటే గర్భస్రావం అయిపోతుందన్నది అపోహ మాత్రమే! బొప్పాయి, పైనాపిల్ వల్ల గర్భిణులకు ఎలాంటి ముప్పు ఉండదు. పండిన బొప్పాయిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి కాబట్టి గర్భిణి ఈ పండును తినడం అవసరం. పచ్చి బొప్పాయిలో లేటెక్స్ అనే పదార్థం, గర్భాశయ సంకోచ వ్యాకోచాలను ప్రేరేపిస్తుంది. కాబట్టి బొప్పాయి గురించి ఒక అపోహ పాతుకుపోయింది. అయితే పండిన బొప్పాయిని గర్భిణులు నిస్సందేహంగా తినొచ్చు. పైనాపిల్ తినడం వల్ల, కొబ్బరినీళ్లు తాగడం వల్ల పుట్టబోయే పిల్లలకు వెంట్రుకలు పెరగవు అన్నది కూడా అపోహే! జన్యుపరమైన కారణాల వల్లే, పసికందులకు వెంట్రుకలు తక్కువగా ఉంటూ ఉంటాయి.

# వరకట్నపు హత్యలు ఇంకెన్నాళ్లు?






**సమయం ప్రతినిధి:** ఐక్యరాజ్యసమితి మహిళా విభాగంలో నేను పనిచేసిన కాలంలో స్త్రీ హత్య (ఫెమిసైడ్-స్త్రీలను, బాలికలను కేవలం జెండర్ కారణంతో చంపడం. 1970వ దశకంలో ఈ పదం ప్రాచుర్యం పొందింది) భావనకు గుర్తింపు సాధించేందుకు విశేష కృషి జరిగింది. ఆ కృషి 1994లో బెలెండో పారా ఒప్పందం (మహిళలపై హింసను మానవ హక్కుల ఉల్లంఘనగా గుర్తించిన ప్రప్రథమ అంతర్జాతీయ ఒడంబడిక)లోను ప్రతిబింబించింది. భారత్‌లో ఏ నేరాన్ని అయినా నిజంగా ఫెమిసైడ్ అని చెప్పాలంటే అది వరకట్న మరణమే అవుతుంది.వరకట్న సంబంధిత ప్రతి విషాదమూ జాతి అంతరాత్మను అమితంగా కలచివేస్తుంది. ఈ విషాదాలు వార్తల్లోకి వచ్చినా రాకపోయినా ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట సంభవిస్తూనే ఉన్నాయి. స్త్రీలను దేవీత్రయం-లక్ష్మి, సరస్వతి, పార్వతిగా పూజించే భారతదేశం స్త్రీల గౌరవాన్ని ఒక వినిమయ సరుకుగా ఎందుకు పరిగణిస్తోంది? స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి వికసిత భారత్‌గా ప్రభవించాలని ఆరాటపడుతున్న భారత్ తన కుమార్తెల విలువను వాహనాలు, నగదు, బంగారం, గృహాలతో నిర్ణయించడం క్షమార్హం కాని అవివేకం కాదా?వరకట్నం ఒక ఆచారం కాదు, ఒక కానుక కాదు, వివాహ మహోత్సవాలలో ఆడంబరపూర్వకంగా ప్రదర్శితమయ్యే 'కుటుంబ ప్రతిష్ఠ' కాదు. అదొక విపణి. వివాహం తన ఆత్మను కోల్పోతున్న సంత అది. వివాహ సమయంలో తల్లిదండ్రులు తమ కుమార్తెకు స్వచ్ఛందంగా ఇచ్చే భూమి, ఆభరణాలు, గృహోపకరణాలు మొదలైన వాటిని స్త్రీ ధనంగా పరిగణించడం మన సమాజంలో పురాతన కాలం నుంచీ వస్తోన్న సంప్రదాయం. మెట్టింటిలో తమ బిడ్డ ఆర్థిక భద్రతకు, గౌరవానికి, స్వతంత్ర ప్రతిపత్తికిగాను కన్నవారు ఆ ఆస్తులను ఇస్తారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఆ సిరి సంపదలపై కుమార్తే ఏకైక హక్కుదారు. భర్త కుటుంబాన్ని సంపద్వంతం చేసేందుకు కాక, మహిళా సాధికారతకు ఆలంబన అయ్యే సంప్రదాయమే స్త్రీ ధనం. ఆధునిక వరకట్నం అనేది స్త్రీ ధనం భావన వికృత రూపం. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడానికి రూపొందించిన ఒక సాధికారిక యంత్రాంగం నుంచి.. మహిళలను సరుకులుగా మార్చే, తరచుగా గృహహింసను ప్రేరేపించే ఒక బలవంతపు లావాదేవీల డిమాండ్‌గా ఇది రూపాంతరం చెందింది.వరకట్నం సాంఘిక దురాచారం మాత్రమే కాదు, అది పచ్చని సంసారంలో హింసకు తావిచ్చే ఒక అనాగరిక వ్యవహారం. డిమాండ్‌తో ప్రారంభమై హక్కుగా అది పరిణమిస్తుంది. ఈ క్రమంలో భౌతిక హింస చోటుచేసుకుని ఆత్మహత్య, హత్యకు పురిగొల్పుతుంది. కులమతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా కుటుంబ వ్యవస్థ అంతటా ఈ దురాచారం ప్రబలంగా ఉన్నది. 2024లో భారతదేశంలో 5,737 వరకట్న మరణాలు నమోదయ్యాయి. ప్రతిరోజూ ఇంచుమించు 16 మంది మహిళలు మరణం పాలయ్యారు. కేవలం 35శాతం కేసులలో మాత్రమే విచారణ పూర్తయి నిందితులకు శిక్షలు పడ్డాయి.వరకట్నం ఒక పురుషుడి గౌరవానికి భంగం కలిగించే వ్యవహారం. కట్నాన్ని డిమాండ్ చేసి తీసుకునే పురుషుడు తనకుతానుగా తన మార్కెట్ ధరను నిర్ణయిస్తున్నాడు. తన పురుషార్థాన్ని, పురుషత్వం-జీవన సామర్థ్యాలు, వ్యక్తిత్వం-విలువను తగ్గించుకుంటున్నాడు. విషాదమేమిటంటే వరకట్నం డిమాండ్లు అరుదుగా మాత్రమే బహిరంగంగా వ్యక్తమవుతాయి. సర్వసాధారణంగా అవి మర్యాదపూర్వకమైన సామాజిక భాషచాటున దాగి ఉంటాయి. నూతన వధూవరులు కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు సహాయపడడం, పెళ్లి ఖర్చులన్నీ వధువు కుటుంబం వారే భరించాలనడం మొదలైన కోరికలుగా అవి ఉండడం కద్దు. అమ్మాయికి ఇచ్చే ఆస్తుల గురించి తేలేదాకా వరుడి కుటుంబం ఆ సంబంధాన్ని ఒప్పుకుంటున్నదీ లేనిదీ చెప్పదు. యువతులు దీన్నొక ముందస్తు హెచ్చరికగా తీసుకోవాలి. విద్య, ఉద్యోగ హోదా కూడా చాలా ముఖ్యం. మానసిక సంసిద్ధత కూడా అంతకంటే ముఖ్యమైనది. వరకట్నం ఆశించే సంబంధం నుంచి వైదొలగడం అంటే నిశ్చితార్థం లేదా వివాహం రద్దు కావడం కాదు. అది ఆత్మరక్షణ. వధువుల వ్యక్తిగత సాధికారతకు అదొక కీలకమైన చర్య. వరకట్న విషాదాలను నివారించడంలో యువతుల తల్లిదండ్రులకు చాలా బాధ్యత ఉన్నది. తొలుత అసలు వరకట్నం ఇచ్చేందుకు అంగీకరించకూడదు. వివాహానంతరం వరకట్నాన్ని డిమాండ్ చేస్తే 'ఆ వివాహ బంధాన్ని ఎలాగైనా కాపాడాలి' అనీ, 'ఎట్టి పరిస్థితులలోను కూతురి కాపురాన్ని నిలబెట్టాలి' అని ఆలోచనలు చేయవలసిరావడం అనివార్యమవుతుంది. భర్తతో సర్దుకుపోవాలని, రాజీపడాలని లేదా కుటుంబ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకోవాలని యువతులకు ప్రతి ఒక్కరూ సలహా ఇస్తుంటారు. హింసాత్మక వాతావరణం నెలకొన్న సంసారంలో గౌరవం లభిస్తుందా? కష్టాల్లో పడ్డ ఆడపడుచులకు తల్లిదండ్రుల గృహం ఒక రక్షణాశ్రయం కావాలేగానీ, ఒక న్యాయస్థానం కాకూడదు. వరకట్న వేధింపులలో అత్త, ఆడబిడ్డ, మహిళా బంధువుల పాత్ర సైతం క్రూరంగా ఉండడం కద్దు. ఒక మహిళ కష్టాలకు తోటి మహిళే కారణమవడం విచారకరం! మన సమాజంలో పితృస్వామ్య వ్యవస్థ సంప్రదాయాలు ఇంకా బలంగా వర్ధిల్లుతున్నాయంటే అందుకు కారణం పితృస్వామ్య అణచివేతలలో మహిళలు భాగస్వాములవడం కూడా అని చెప్పక తప్పదు. భారతదేశంలో వరకట్నాన్ని ఇవ్వడం, తీసుకోవడం నిషిద్ధం. 1961లోనే వరకట్న నిషేధ చట్టం అమలులోకి వచ్చింది. భారతీయ న్యాయసంహితలోని సెక్షన్ 80 వరకట్న మరణాలకు సంబంధించినది. అది నిందితులకు కఠిన శిక్షలు నిర్దేశించింది. క్రూరత్వం, వేధింపులు మొదలైన నేరాలపై విచారణ సెక్షన్ 85 కింద జరుగుతుంది. చట్టం పటిష్ఠంగా ఉన్నది. మరి అది సరైన రీతిలో అమలవుతున్నదా? చట్టాలను అమలుపరచనప్పుడు నేరాలను ఎలా నిరోధించగలుగుతాము? వరకట్న సంబంధిత కేసులలో చాలామంది నిందితులు నిర్దోషులుగా విడుదలవుతున్నంత మాత్రాన అవి తప్పుడు కేసులు కావు. విచారణలో జాప్యం, సామాజిక ఒత్తిడి, కోర్టు వెలుపల పరిష్కారాలు మొదలైన కారణాలతోనే చాలామంది నిర్దోషులుగా విడుదలవుతున్నారు.మరి వరకట్న నేరాలను అరికట్టడమెలా? వరకట్న ఆచారాన్ని నిరోధించడమే. యువతులకు సాధికారత కల్పించడం ద్వారా వరకట్నాన్ని వ్యతిరేకించేలా చేయాలి. సంబంధిత చట్ట నిబంధనలను కచ్చితంగా అమలుపరచాలి; సంరక్షణ చర్యలు ముఖ్యం. ఈ నేరాలు, ఘోరాలు జరిగినప్పుడు వెన్వెంటనే అధికార వ్యవస్థకు సమాచారమందించి, బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలి. బాధ్యతాయుతమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి. నమోదైన కేసులపై విచారణ సత్వరమే జరిగేలా చూడాలి. జరిగిన నేరానికి భర్త, అత్తమామలు, ఆడబిడ్డలు, ఇతర బంధువులను జవాబుదారీ చేయాలి. బాధితుల మానసిక ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలి. వరకట్న దురాచారాన్ని నిర్మూలించి తీరాలి. అది ధర్మ విరుద్ధమైనది, అనాగరికమైనది. మహిళ హుందాను ఉల్లంఘిస్తుంది. పురుషుడి గౌరవాన్ని తగ్గిస్తుంది. కుటుంబాన్ని అవినీతిపాలు చేస్తుంది. సమభాగస్వామ్యమైన వివాహవ్యవస్థను విషతుల్యం చేస్తుంది. బలవంతపు చర్యలను ఏ ఆచారమూ అంగీకరించదు. వరకట్నాన్ని తీసుకోవడం ఏ కుటుంబానికీ గౌరవనీయం కాదు. ఆర్థిక లావాదేవీతో ప్రారంభమయ్యే ఏ వివాహమూ పవిత్రమైనది కాజాలదు.

# ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేయాలి





**రైతుల శ్రేయస్సుకు చిత్తశుద్ధితో పనిచేయాలి**
**నకిలీ విత్తనాలు అమ్మే డీలర్లపై కఠిన చర్యలు**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల జిల్లా :** మంగళవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని పెస్టిసైడ్ దుకాణాల డీలర్లు, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, డీలర్లు, అధికారుల కారణంగా రైతులకు ఏ చిన్న సమస్య వచ్చినా సహించేది లేదన్నారు. ఫెయిల్ అయిన, విడిగా ఉండే, గడువు ముగిసిన విత్తనాలను విక్రయించకూడదన్నారు. ప్రతి పెస్టిసైడ్ దుకాణాల వద్ద సంబంధిత డీలర్లు స్టాక్, ధరల పట్టిక, తదితర వివరాలను విధిగా ప్రదర్శించాలన్నారు. విత్తనాలు, ఎరువులు అమ్మేందుకు కొత్తగా లైసెన్సు తీసుకునేవారు, రెన్యువల్ చేసుకోవాల్సిన డీలర్లు నిబంధనలను పాటించాలన్నారు. యూరియా కొరత, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగినందున అన్నదాతలు నానో యూరియాపై దృష్టి సారించేలా సహకరించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు పాటించని సంబంధిత దుకాణాల డీలర్ల పై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీలో జోగులాంబ గద్వాల జిల్లా ప్రస్తుతం 68 శాతంతో రాష్ట్రంలో 28వ స్థానంలో ఉందని, వంద శాతం పూర్తి చేసేందుకు ఏఈవోలు నిబద్ధతతో పనిచేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు కూడా ప్రత్యేక చొరవ తీసుకొని ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం అయ్యేందుకు రెండు రోజులకోసారి తమ పరిధిలోని ఏఈవో లపై పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ అన్నదాతల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. పిఎండిడికేవై కు జోగులాంబ గద్వాల జిల్లా ఎంపికవడంతో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రైతులు సాంకేతికతను వినియోగిస్తూ ఆర్థికంగా ఎదిగేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పలువురు ఏఈఓ లతో వారి క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతుల ఫార్మర్ రిజిస్ట్రీ గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, అదనపు ఎస్పీ శంకర్, ఆత్మ డిప్యూటీ పిడి జగ్గు నాయక్, ఏడిఏ సంగీతలక్ష్మి, ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర టాస్కోఫోర్స్ టీం
## హైదరాబాదు వారి ఆధ్వర్యంలో తనిఖీలు






**వనపర్తి, సమయం ప్రతినిధి:** రాష్ట్ర టాస్కోఫోర్స్ టీం హైదరాబాద్ మరియు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల ఆధ్వర్యంలో శ్రీ సాంబశివ ఆగ్రో ఇండస్ట్రీస్ మీరాస్పల్లి గ్రామము కొత్తకోట మండలం యందు తనిఖీలు నిర్వహించినారు . ఈ తనిఖీలో 25,426 బస్తాల జవీ= ధాన్యం పక్కదారి పట్టినట్టుగా నిర్ధారణ జరిగింది. ఈ ధాన్యం విలువ 2.5 కోట్లు కలవు, తదుపరి ఈ మిల్లు వద్ద పంచుల సమక్షంలో పంచనామ నిర్వహించి మిల్లు వద్ద ఉన్న మిగులు ధాన్యం తగు భద్రత నిమిత్తం వీ/హా ాాఖ= ఇండస్ట్రీస్ రాయినిపేట వారికి అప్పగించినైనది తదుపరి ఆ మిల్లు యజమానిపై చట్టరీత్యా తగు చర్య తీసుకునుటుగాను దస్త్రము అదనపు కలెక్టర్ పౌరసరఫరాల కి సమర్పించనైనది తదుపరి ఆదేశాల మేరకు ఈ మిల్లర్ పై చట్టరీత్యా తగు చర్య తీసుకోబడును అన్నారు.




హైదరాబాద్ : గచ్చిబౌలిలోని హిల్ రీడ్జ్ విల్లాలో దోపిడి కేసును 24 గంటల్లో ఛేదించామని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ దోపిడికి పాల్పడిన ఇద్దరు నేపాలీ దొంగలను ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 7 కిలోల బంగారంతోపాటు కిలోన్నర వెండి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దోపిడి జరిగిన వెంటనే ఫిర్యాదు అందడంతో.. ఆరు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నిందితులకంటే ముందే భారత్, నేపాల్ సరిహద్దుల్లోకి ఆయా బృందాలు చేరుకున్నాయని వివరించారు. తద్వారా నిందితులను అరెస్ట్ చేయడం సులువైందన్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని న్యాయస్థానంలో నిందితులను హాజరు పరిచి అనంతరం హైదరాబాద్‌కు తీసుకోస్తామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఇంట్లో నేపాలీ పని మనుషులను పెట్టుకొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు డీసీపీ సూచించారు. హిల్ రీడ్జ్ విల్లాలో ఇంటి ఓనర్లు బయటకు వెళ్లే సమయంలో లాకర్ కీ దాచే ప్రదేశాన్ని నేపాలీ పని మనిషి దంపతులు ముందుగా గుర్తించారని తెలిపారు. అలా ఇంట్లో యజమానులు లేని సమయంలో ఈ దంపతులు లాకర్ ఓపెన్ చేసి బంగారం, వెండి చోరీ చేశారని వివరించారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సైబరాబాద్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టి దోపిడి దొంగలను అరెస్ట్ చేశారని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వివరించారు.

## నల్లగొండ జిల్లా దామరచర్ల లారీ యార్డ్ వద్ద ఘోర ప్రమాదం..

నల్లగొండ: దామరచర్ల లారీ యార్డ్ వద్ద ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు మృతిచెందారు. మృతులను వాడపల్లికి చెందిన బత్తుల ధనుంజయరావు(43), ఉప్పుతల నరసింహారావు(38), దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన డెక్క వెంకటేశ్(25)గా పోలీసులు గుర్తించారు. స్థానికంగా ఉన్న ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేసేందుకు ధనుంజయరావు, నరసింహారావు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. వారిద్దరూ దామరచర్ల లారీ యార్డ్ వద్దకు రాగానే.. బైక్?పై వేగంగా వచ్చిన వెంకటేశ్(25) అనే యువకుడు వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధనుంజయరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన నరసింహారావు, వెంకటేశ్‌ని హుటాహుటిన మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. కాగా, వెంకటేశ్ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మరోవైపు మెరుగైన చికిత్స కోసం నరసింహారావును నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. ఒకే ప్రమాదంలో ముగ్గురు మృతిచెందడంతో దామరచర్ల మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085